


ఇలియాస్
జ్యోత్స్న

# మృత్యువుతో ముఖాముఖి

# అందాలరాశి కుముద్ అతడ్నిచూసి చిన్నగానవ్వింది!



ఆ నవ్వుకి భాష్యం అతనికి ఎంతవరకు అర్థమైందోగానీ, ఆ తరువాత అతని చూపులు మాత్రం కుముద్‌మీదే ఉన్నాయి.

తను చిటికవేస్తే చాలు, ఆ కుర్రాడు తనకోసం ఏమైనాసరే చెయ్యడానికి వెనుకంజ వేయడని కుముద్‌కి తెలుసు. కుముద్‌కి ఇదేం కొత్తకాదు. లోగడ ఇలా ఎన్నిసార్లు జరిగిందో! పార్టీనిండా తన స్నేహితులే వున్నా, కుముద్ కావాలని ఒంటరిగా బాల్కనీలోకి వెళ్ళికూర్చుంది. మంత్ర ముగ్ధుడిలా అక్కడికి చేరాడా యువకుడు.

"హల్లో!" సందేహిస్తూ పలకరించాడతను. అప్పుడే అతన్ని మొదటిసారి చూస్తున్నట్టు ఆశ్చర్యంగా కళ్ళు పెద్దవి చేసి చూసింది కుముద్.

"ఒంటరిగా కూర్చున్నారేం!... మీరొక్కరే వచ్చారా పార్టీకి?" అవునని తలూపింది కుముద్.

"మీ కభ్యంతరం లేకపోతే నేను మీకు కంపెనీ ఇవ్వనా?"

"ఓ ష్యూర్!... కానీ... మీకూ కంపెనీ లేదా?"

"మావాళ్ళంతా గేమ్స్‌లో బిజీ అయిపోయారు..."

అతనికేసి పరిశీలనగా చూసింది కుముద్...

జీన్స్‌ప్యాంట్.... వదులుగా షర్ట్.. ఇరవై రెండేళ్ళుంటాయేమో అంటే తనకంటే బాగా చిన్నవాడు!... కండలు తిరిగిన అతని శరీరం చూస్తే అతను స్పోర్ట్స్‌మన్ అయ్యుండాలనిపించింది కుముద్‌కి.

అతనితో సంభాషణ పెంచడానికి అతని వివరాలు అడిగింది కుముద్!.... పేరు శ్రవణ్... బ్యాంకులో ఆఫీసర్! కాలేజీలో ఉండగా అథెలిటిక్స్ ఛాంపియన్ అట!

కుముద్ మనస్సంతా కండలు తిరిగిన అతని శరీరంమీదే ఉంది!...

'ఇక వెళ్తానండీ'... అంటూ చటుక్కున లేచింది. మాటలు మధ్యలోనే ఆపేసి శ్రవణ్ కూడా లేచి నిలబడ్డాడు.

పదండి.... మీ కారుదాకా వస్తాను" అన్నాడతను.

"కారు తీసుకురాలేదు... ఆటోలోనో టాక్సీలోనో వెడతాను" అంది కుముద్

"ఇంతరాత్రి వేళ ఆటో దొరుకుతుందా?... నేను

కథలపోటీలో కన్సొలేషన్

బహుమతి రూ.500/- పొందిన కథ

డ్రాప్ చెయ్యనా?''... సంశయిస్తూ అడిగాడు.

అతనలా అడుగుతాడని కుముద్‌కి ముందే తెలుసు... ఇద్దరూ మోటార్‌సైకిల్ మీద బయలుదేరారు... కుముద్ చెప్పిన బంగళాముందు మోటార్‌సైకిల్ ఆపాడు శ్రవణ్.... అతడ్ని లోపలికి ఆహ్వానించిందామె...

తలుపు తెరిచిన పనివాడు ఇదేమీ కొత్తకాదన్నట్టు నిలబడ్డాడు. తలుపుదగ్గరకు వేసి వెళ్ళమని అతడ్ని పురమాయించి, శ్రవణ్ చెయ్యిపట్టుకుని లోపలికి నడిచింది కుముద్.

"ఇంట్లో ఎవ్వరూ లేరా?..." అడిగాడు శ్రవణ్ చుట్టూ కలయచూస్తూ...

"లేరు... నేనొక్కదాన్నే ఉంటాను..."

"ఒంటరిగా... ఒంటరిగా వుంటారా ఇంత ఇంట్లో!..."

ఆశ్చర్యంగానూ, ఆనందంగానూ అడిగాడు శ్రవణ్...

"అవును ఏం?... ఉండకూడదా....?" ఎదురుప్రశ్న వేసింది కుముద్...

"శ్రవణ్!... ఇప్పుడు ఈ బంగళాలలో మీరూ, నేనూ... మనిద్దరమే ఉన్నాం..." అంది అతని దగ్గరగా వచ్చి మెడచుట్టూ చేతులు వేస్తూ.

ఆ ఇంట్లో వాళ్ళని గమనిస్తూన్న మరొకరున్నారని కుముద్ గ్రహించలేదు. ఆమె ప్రతికదలికను, మనస్సులోని ప్రతి కోరికనూ, ఆలోచననూ ఇట్టే పట్టేస్తున్న ఆ ఆకారాన్ని కుముద్ గమనించలేదు.

శ్రవణ్‌కి మరింత దగ్గరగా జరిగి, తన ఛాతీ అతనికి తగిలేలా ఆనుకుని కూర్చుంది. అనుభవంలేని శ్రవణ్ బెరుగ్గా చూస్తుంటే అతడ్ని ముద్దుల్లో ముంచెత్తి ఉక్కిరి బిక్కిరి చేసింది... ఆ తరువాత సమయమెలా గడిచిందో ఇద్దరికీ తెలియదు... తెలతెలవారుతుండగా శ్రవణ్ వెళ్ళిపోయాడు.

కుముద్ డ్రాయింగ్ రూం సోఫాలో వాలిపోయి అలసటతో కళ్ళుమూసుకుంది.... మనస్సంతా వెలితిగా, శూన్యంగా ఉంది...

.... ఏవో ఆలోచనలు... చికాకు.. ఎప్పటిలాగే... తనెందుకిలా ప్రవర్తిస్తోంది... ఇది తన మానసిక బలహీనతా?

"అవును... ఇది కేవలం నీ మానసిక బలహీనతే!"... ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది కుముద్... ఎదురుగా నీడల్లోంచి కదిలి వచ్చిందో ఆకారం!... నల్లటి బట్టల్లో తెల్లని మొహం!

.... జీవకళ ఏ కోశానా లేకపోయినా, కళ్ళల్లో మాత్రం ఏదో వింతకాంతి!... తేజస్సు! ఆ ఆకారం ఎవరు? తన మనస్సులో ఆలోచనలు అతనికెలా తెలుస్తున్నాయి?...

"నాకు నీ గురించి అంతా తెలుసు.... నీ బలహీనత పేరు నింఫోమానియా... నీ పదహారవ ఏట నుండీ నిన్ను పట్టి పీడిస్తోంది ఈ బలహీనత... కాలేజీ పిక్నిక్‌లో రాంశర్మ.... ఆ తరువాత ఖద్దూస్‌తో అతని గదిలో... అలాగే నర్సింగరావు... రంగారావు... పీటర్... ఇలా రోజురోజుకీ నీ కోరిక విజృంభిస్తోంది... నిన్ను ప్రేమించిన శ్రీధర్... పెళ్ళి చేసుకుంటానన్నా నీలో మార్పురాలేదు..."

"స్టాపిట్!... ప్లీజ్... ఇహ ఆపు అవన్నీ గుర్తుచేయకు" అరిచింది కుముద్.

"నీ గతం అంత భయంకరమైనదన్నమాట!... కానీ తప్పదు... అవన్నీ నీకు గుర్తురాక తప్పదు..."

"ఎందుకు?" మొండిగా ప్రశ్నించింది కుముద్.

"ఆలోచించు!..."

"నేను చేసింది పాపమా? నన్ను శిక్షించడానికి వచ్చావా?" నెమ్మదిగా అడిగిన కుముద్ మాటలకు అడ్డంగా తలూపిందా ఆకారం!

పాపం పుణ్యం అంటే ఏమిటో నాకు తెలియదు... నీ బలహీనతవల్ల నువ్వు పోగొట్టుకున్న దేమిటో నీకు తెలియజెయ్యడానికే నేను వచ్చాను... అందం, ఐశ్వర్యం, తెలివి తేటలూ అన్నీ ఉండీ జీవితాన్ని కుక్కలు చింపిన విస్తరి చేసుకున్నావని చెప్పడానికి వచ్చాను... నిరర్థకమైన బతుకు సాగించావని తెలియజెయ్యాలని వచ్చా ను..."

కుముద్‌కి ఆ మాటలు వింటుంటే గతమంతా ఒక్కసారి కళ్ళముందుకి వచ్చింది.... మనస్సు వికలమయింది... జీవితంలో తను ఓడిపోయానని తెలిసింది...

"ఇప్పుడు నేనేం చెయ్యాలి....?" నిస్సహాయంగా ప్రశ్నించింది...

"పద వెళ్దాం..." అంటూ ఆగకుండా బయటకు దారితీసిందా ఆకారం...

కారు తాళాలందుకుని బయటికి వెడ్తూ ఒక్కసారి తన ఇంటికేసి ఆర్తిగా చూసుకుంది కుముద్!... తను పుట్టి






## వెదికినందుకు

"సార్! ఆరు రూపాయలివ్వండి!" అన్నాడు మంగయ్య.

"అదేమిటోయ్! హెయిర్‌కట్‌కు రెండు రూపాయలే కదా?" ప్రశ్నించాడు సన్యాసిరావ్.

"ఔనండి! హెయిర్‌కట్‌కు రెండే రూపాయలు. కాని మీ తలపైన వెంట్రుకలు వెతికినందుకు నాలుగు రూపాయలు" జవాబిచ్చాడు మంగయ్య.

—కె. సురేఖ (హైదరాబాద్)

పెరిగిన ఆ ఇంటిని చివరిసారిగా వదిలిపెట్టి వెళ్ళిపోతున్నట్టు చూసుకుంది... కారు తాళం తీయబోయి, ముందు సీట్లో కూర్చుని ఉన్న అతడ్ని చూసి ఆశ్చర్యపోయిందామె... అతనెలా కారెక్కాడో ఆలోచించకుండా కారు స్టార్ట్‌చేసింది. స్పీడ్ మీటర్ ముల్లు యాభై... అరవై... ఎనభై... చూపిస్తోంది... ఆక్సిలేటర్ మరింత కిందకుతోసి, ఎదురుగా వేగంగా వస్తున్న లారీకేసి చూసింది.... తన పక్కనే ఉన్న ఆకారం అంగీకారంతో స్టీరింగ్ పూర్తిగా ఎడంవైపుకి తిప్పుతూ అతని ఒళ్ళో వాలిపోయింది.

కుముద్!...

కారు స్కిడ్ అయి రెండు పల్టీలు కొట్టి రోడ్డుపక్కన చెట్టుకి గుద్దుకుని ఆగిపోయింది...

అందాలరాశి కుముద్ జీవితం అయిపోయింది!... అక్కడికక్కడే ఆగిపోయింది!! సగంలోనే స్తంభించింది!!!

* * *

శ్యాంప్రసాద్ మాటలు విసుగు కలిగిస్తున్నాయి బాబూరావుకి. కానీ తప్పదు కనుక, ఎంతో శ్రద్ధగా వింటున్నట్టు కూర్చున్నాడు.

"... ఆ నవల సరిగ్గా నాలుగేనాలుగు రోజుల్లో పూర్తి చేసానంటే నమ్ముతారా?"

జవాబు చెప్పకుండా కూర్చున్నాడు బాబూరావు.

"ఆ మధ్య ఒకసారి ఢిల్లీ వెళ్లాను.... ట్రైన్‌లోనే సగానికి పైగా నవల పూర్తిచేసేసాను... మిగతా సగం ఢిల్లీ హోటల్లో పూర్తిచేసేసాను... దానికి అవార్డు కూడా వచ్చింది.... ఇప్పటికి ఐదుసార్లు అమ్మివేసారా నవల... మీరు చదివారా?"

"ఏ నవల?" అడిగాడు బాబూరావు గ్లాసులోని బీరు సిప్ చేస్తూ....

"రాసలీల!.... చదివారా?"

చదివానన్నట్టు తలూపాడు బాబూరావు.

పెళ్ళి

"డబ్బు కోసం ఓ ఫూల్‌ను పెళ్ళిచేసుకొంటారా?" తన గర్ల్ ఫ్రెండును అడిగాడు కోటీశ్వరుడయిన కోటేశ్వరరావుగారి అబ్బాయి ధనవంత్.

"ఏం? మీరు నన్ను పెళ్ళి చేసుకొందామనుకొంటున్నారా?" వెంటనే అడిగిందా గడుసుపిండం.

—జోకర్ (హైదరాబాద్)

"ఎనభైమంది స్త్రీలను ఇంటర్‌వ్యూ చేసాను ఆ నవల రాసేముందు. వాళ్ళ పేర్లు ఎక్కడా ప్రస్తావించకుండా, వాళ్ళ అభిప్రాయాలు మాత్రం యధాతథంగా రాసేశాను... పడకగదిలో భర్త నుండి భార్య ఆశించేదేమిటో, ఇంతవరకూ ఎవ్వరూ రాయని విధంగా, ఒక ప్రత్యేకమైన బాణీలో చెప్పాను... అసభ్యత ఎక్కడా ఉండదు... ఆడవాళ్ళ మనస్సుల్లోకి తొంగి చూడకుండా రాసేస్తుంటారు. అందరూ... వాట్టీ ట్రాష్... ఇదంతా ఎందుకు? నా నవల సైంటిఫిక్ సెక్స్‌గైడ్ అని చెప్పవచ్చు." అన్నాడు శ్యాంప్రసాద్ సిగరెట్ ముట్టిస్తూ.

సాయంత్రం ఆరున్నర దాటింది. మసక చీకట్లో శ్యాంప్రసాద్ మొహం సరిగ్గా కనిపించడంలేదు బాబూరావ్‌కి. కానీ మాట తీరునిబట్టి మందుమైకం తలకెక్కింది బాగా అని అర్థమయింది. సీనియర్ రైటర్‌గా శ్యాంప్రసాద్ సలహాలు తీసుకుందామనుకుని వచ్చిన బాబూరావుకి నిరాశే మిగిలింది. గంటన్నర నుండి శ్యాంప్రసాద్ సెల్ఫ్‌డబ్బా కొట్టుకుంటుంటే వినడమే, చివరకు మిగిలింది.

"ఇక నేను బయల్దేరుతానండీ" అంటూ లేచాడు బాబూరావ్.

"సరే.... మీరు వెళ్తూ ఓ సారి బార్ కుర్రాడ్ని రమ్మన్నానని చెప్పండి" అన్నాడు శ్యాంప్రసాద్.

పంపిస్తానంటూ శ్యాంప్రసాద్ నిష్క్రమించాడు.

సరిగ్గా అదే సమయానికి చెట్ల నీడల్లోంచి మెల్లిగా కదిలి బయటకు వచ్చిందా ఆకారం! నల్లటి బట్టల్లో తెల్లగా మెరిసిపోతున్న ఆ ఆకారాన్ని ఆశ్చర్యంగా చూస్తూ కూర్చున్నాడు శ్యాంప్రసాద్. అప్పుడే అక్కడి నుండి బయల్దేరిన బాబూరావ్ ఆ వ్యక్తిని చూసి పక్కకు తప్పుకోనైనా తప్పుకోలేదు!.... అలా నడుస్తూ ఆ ఆకారంలోంచి నడుచుకుంటూ వెళ్ళిపోయాడు??

చీకటివల్ల తనకలా కనిపించిందా లేక విస్కీ ఎక్కువైందా?

ఆ ఆకారం శ్యాంప్రసాద్ దగ్గరగా వచ్చి బాబూరావ్ ఖాళీచేసిన కుర్చీలో కూర్చుంది....

"ఎవరు మీరు?... ఏం పనిమీద వచ్చారు...?"

"మీతో మాట్లాడాలి... మనం కలుసుకోవడం ఇదే మొదటిసారి కనుక నేనెవర్నో మీకు తెలియదు... కానీ నాకు మీ గురించి తెలుసు"

"ఏం మాట్లాడాలో చెప్పండి" అన్నాడు శ్యాంరావు కొంచెం రిలాక్సు అయి...

"మీ రచనల గురించి మాట్లాడుకుందామా? ఈ మధ్య రాయడం ఎందుకు మానేసినట్టు?"

"ప్రస్తుతం.... రెండు నవలలు వర్క్ అవుట్ చేస్తున్నాను.. బర్నింగ్ టాపిక్స్‌తో సెన్సేషనల్‌గా ఉండేలా ఆలోచిస్తున్నాను..."

"మీరు ఎన్నుకున్నపుడు అవి బర్నింగ్ టాపిక్స్ అయివుండవచ్చు. కానీ. ప్రస్తుతం కావు... ఆ సంగతి మీకు తెలియనిది కాదు. అయినా ఈ మధ్య ఆ టాపిక్స్ నర్సింహరాజు కవర్ చేసేసాడుగా?"

ఏదో చెప్పబోతూ ఆగిపోయాడు శ్యాంప్రసాద్.

ఎవరితను? ఈ వివరాలన్నీ ఇతనికెలా తెలుసు? తన మనస్సులోని మాటలు కూడా ఇట్టే గ్రహించేస్తున్నాడు?

"నాకన్నీ తెలుసు.. తెలుసుకాబట్టే నీ కోసం ఇలా వచ్చాను" తన ఆలోచనలను పుస్తకంలా చదివేస్తున్నాడు!

"ఒకప్పుడు నువ్వు నిజంగా ఎంతో గొప్ప రచయితవి! కొన్ని వందల రచనలు చేసావు... నీ రచనలు లోగడ ఎలా ఉండేవి? గుర్తుందా?..."

నిజమే! తన కథల్లోని పాత్రలు కేవలం ఊహాచిత్రాలు కాదు... సజీవమూర్తుల్లా, ఉండేవి... తన పాత్రలతో తనకు జన్మాంతర బంధం ఉన్నట్లు ఫీలయ్యేవాడు తను!

"ఆ తరువాత...? రానురాను నీ రచనల్లో పస ఇగిరిపోయింది... నీకు పేరు ప్రఖ్యాతుల కైపు తలకెక్కింది.. రచయితగా సంఘంపట్ల నీ బాధ్యతను మర్చిపోయి, కేవలం డబ్బుకోసం రాయడం మొదలుపెట్టావు... అప్పుడే నీ పతనం ప్రారంభమైంది. ఆత్మవంచన చేసుకుంటూ అర్థంలేని బ్రతుకు బ్రతుకుతున్నావు పసుమర్తి శ్యాంప్రసాదూ!"

అతన్ని ఎక్కడా ఆపకుండా, మాటలు పూర్తిగా విన్నాడు శ్యాంప్రసాద్... అతని మాటలు అక్షరలక్షలు విలువ చేస్తాయి... ఇన్నాళ్ళూ తన మనస్సులోంచి వాటిని బయటకు రానివ్వకుండా తొక్కి పెట్టాడు తను!!

అంతలో బార్ కుర్రాడు వస్తే, తనకోసం రెండు బాటిల్స్ విస్కీ ఆర్డరిచ్చి, అలాగే ఆ వ్యక్తికోసం కూల్‌డ్రింక్ చెప్పాడు శ్యాంప్రసాద్... కూల్‌డ్రింక్ ఎవరికోసమన్నట్టు ఎదురుగా కనిపిస్తున్న కుర్చీకేసి చూసి ఏదో అర్థమైనట్టు తలపంకించి వెళ్లిపోయాడతను.

"నా మనస్తత్వాన్ని ఇంత బాగా అర్థం చేసుకున్నావ్! నా గతమంతా పూసగుచ్చినట్టు చెప్తున్నావ్!! మరి నా భవిష్యత్తు?... చెప్పగలవా?" ... మాటగా ప్రశ్నించాడు శ్యాంప్రసాద్.

"నువ్వే ఓ పెద్ద రచయితవి! నీకు నేను భవిష్యత్తు చెప్పాలా... నువ్వే నీ కథలోని పాత్రవైతే?... ఆ పాత్ర భవిష్యత్తేమిటి?.... నాకు తెలుసు... నీ కథల్లో ముగింపు చావుంటుంది... నువ్వు సరిగ్గా ఆలోచిస్తావు."

ఉలిక్కిపడ్డాడు శ్యాంప్రసాద్.... రచయితగా అనేక అద్భుతాలు చేసిన వ్యక్తి ఇలా తయారైతే... అతను ఉన్నా లేకపోయినా ఒకటే!... అయితే తను రచయితగా చనిపోయాడు కనుక తన బ్రతుకు ముగిసిపోయినట్టేనా?

అవును! తన బ్రతుకుకిక అర్థంలేదు... తను ఇలా పతనమై పోతూ బ్రతకనవసరంలేదు...

"ఎస్... యూ ఆర్ రైట్... నాలోని రచయిత చచ్చిపోయాడు... ఇప్పుడు నా శరీరం చావుని వరిస్తుంది"

అంటూ అపుడే బార్ కుర్రాడు తెచ్చిపెట్టిన విస్కీసీసాలు అందుకుని గడగడ తాగేశాడు పసుమర్తి శ్యాంప్రసాద్, ప్రఖ్యాత రచయిత... అంతవరకూ శ్యాంప్రసాద్‌ని మాట్లాడించిన ఆకారం నెమ్మదిగా కదిలి శ్యాంప్రసాద్ వెనుకగా వచ్చి నిలబడింది.

సుప్రసిద్ధ రచయిత శ్యాంప్రసాద్ తన కథకు ముగింపు నిర్ణయించాడు.

* * *

రాత్రి ఒంటిగంట దాటింది! టాంక్‌బండ్ నిర్మానుష్యంగా ఉంది. వెన్నెట్లో హుస్సేన్‌సాగర్ నిర్మలంగా మెరుస్తోంది.


భాస్కర్ రైలింగ్‌ని ఆనుకుని నిలబడ్డాడు. అతని ఎదురుగా బెంచీమీద ఒక విచిత్రమైన వ్యక్తి భాస్కర్ ఆలోచనల్ని పసిగట్టేస్తూ అతడ్ని ఆశ్చర్యంలో ముంచేస్తున్నాడు.

"మీరెవరో నాకు తెలియదు... కానీ మీ మాటలన్నీ మాటికి నూరుపాళ్ళు నిజం! చచ్చిపోవాలనే ఈ ఆలోచన నాకు కొత్తకాదు."

"నీ జీవిత ధ్యేయం ఏమిటి?"... కదలీకదలని ఆ ఆకారం నోట్లోంచి ఊడిపడింది చిక్కుప్రశ్న.

చనిపోవాలని కలలు కంటున్న నాకు జీవిత ధ్యేయమా? ఆశయాలు, ధ్యేయాలు... ఇవన్నీ అర్థంలేని పదాలు... ఈ అర్థంలేని మాటల్ని పట్టుకుని అనవసరంగా తాపత్రయ

జ్ఞాపకశక్తి



పడుతుంటారు చాలామంది... ఆ తాపత్రయంలో అసలు వాళ్ళు సుఖపడేదేమిటో... దేనికోసం పరుగులు పెడ్తున్నారో.. ఏమీ తెలియకుండా... ఈ బ్రతుకు బ్రతకడం నిరర్థకం!...." అన్నాడు భాస్కర్ ఆవేదనతో.

సరిగ్గా అదే సమయానికి అక్కడికో అందమైన స్త్రీ ఆకారం వచ్చింది... ఆమె రాకతో అక్కడి వాతావరణం ఆహ్లాదాన్ని చైతన్యాన్ని సంతరించుకుంది. కానీ భాస్కర్ మాత్రం ఆమెని గమనించలేదు... ప్రక్కనే ఉన్నా ఆమె ఉనికిని అతను గుర్తించలేదు... భాస్కర్‌తో సంభాషిస్తున్న మొదటి ఆకారానికి ఆమె రాక నచ్చకపోయినా మరేమీ చెయ్యలేక ఊరుకోవలసి వచ్చింది... మళ్ళీ అంతలోనే భాస్కర్‌కేసి తిరిగి తన పని కొనసాగించింది ఆ మొదటి ఆకారం.

"ఈ ప్రపంచంలో అందరూ ఏం చేస్తున్నారో మన కనవసరం... నీ సంగతి చెప్పు" ఆకారం అంది భాస్కర్‌తో

"ధనార్జన... పేరు ప్రఖ్యాతులకోసం ప్రాకులాట... ఇదేనా జీవిత ధ్యేయమంటే... ఇవన్నీ గాలికబుర్లు... సంఘం కోసం ధరించిన మేలి ముసుగులు... ఈ ముసుగులతో నటించడం నాకు చాతకాదు... నేనిక నటించలేదు... అందుకే...." భాస్కర్ తనతో తను చెప్పుకుంటున్నట్టు న్నాడు...

"ఏం చేస్తావు మరి?"

భాస్కర్ ఆలోచించడం మొదలు పెట్టాడు.

అతనిని అంటిపెట్టుకున్నట్టున్న స్త్రీ ఆకారం అతనికేసి లాలనగా, వాత్సల్యంగా చూసింది... అంతలో భాస్కర్ కళ్ళల్లో ఆశ తళుక్కుమని మెరిసింది....

"ఇక ఈ నటనకు స్వస్తిచెప్పి, జీవితం నుండి నిష్క్రమించడం మంచిదనుకుంటాను..." సందేహిస్తూ అన్నాడు భాస్కర్...

ఆ స్త్రీ భాస్కర్‌కి మరింత దగ్గరగా జరిగింది...

"అసలు ఈపాటికి అంతా అయిపోయి ఉండవలసింది... అన్ని ఏర్పాట్లూ చేసుకునే వచ్చాను... కానీ... నేను తొందర పడుతున్నానేమో నన్న అనుమానం వస్తోంది!" ప్రశాంతంగా ఉన్న హుస్సేన్‌సాగర్ కేసి చూస్తూ అన్నాడు భాస్కర్...

సికింద్రాబాద్ నుండి సెకండ్‌షో సినిమా చూసిన జనం తిరిగి వస్తున్నారు... వారిలోని కొన్ని జంటల్ని చూడగానే అతనికి మీనాక్షి జ్ఞాపకం వచ్చింది, మీనాక్షికి తనతో ఎంత అవసరం ఉందో గుర్తొచ్చింది... తనకి ఎవ్వరి అవసరమూ లేకపోయినా, తన అవసరం ఉన్నవాళ్ళూ, తనమీదే ఆధారపడినవాళ్ళూ ఆనందం కోసం బ్రతకడంలో అర్థం ఉందనిపించింది! ఇంత చిన్న విషయం ఇన్నాళ్ళూ తనకెందుకు తట్టలేదో ననిపించింది!! జీవితంలో తను చెయ్యవలసిందీ, నేర్చుకోవలసిందీ మరెంతో మిగిలిపోయిందనిపించింది!

"నో... నేను చావను! నేను చావుకి భయపడడం లేదు!! కానీ, బ్రతికి నేను సాధించవలసింది ఎంతో ఉంది! ఈ వరకే సాధించినది నాతోటి వారితో పంచుకోవలసిన అవసరం ఉంది.... నా కర్తవ్యం నా కిపుడే తెలిసిరాకపోయినా, పరిణామ క్రమంలో, నా అంతరంగం దాన్ని నా కందిస్తుంది... నేను చావను!" అంటూ అక్కడి నుండి కదిలాడు భాస్కర్...

భాస్కర్ మొహంలో ఉత్సాహం మెరుస్తోంది!

హుషారుగా అక్కడ్నించి కదిలాడు... రోడ్డుకి అవతలవైపు ఉన్న తన మోటార్ సైకిల్ స్టార్ట్‌చేసి బయల్దేరాడు... చీకటిని చీల్చుకుంటూ ముందుకి సాగిపోయాడు భాస్కర్!...

* * *

భాస్కర్ వెళ్ళాక నల్లటి ఆకారం లేచి నిలబడింది...

"నువ్వతనితో వున్నావని తెల్సుకోలేక పోయాను... నాలో కలుపుకుందా మనుకున్నాను."

"అతను నా ఉనికిని ఇన్నాళ్ళు గమనించలేదు. అందుకే ఈ పరిస్థితి వచ్చింది. ఇక అతడ్ని అర్ధాంతరంగా కబళించే శక్తి నీకు కూడాలేదు. తన జన్మకు పరమార్థం తెలుసుకోగల సమర్థుడు అతను.." అంటూ—

అక్కడ్నించి బయల్దేరింది... స్త్రీ ఆకారంలో ఉన్న చైతన్యం...

—జీవితాన్ని అర్థం చేసుకొని ఒక కొలమనుకుంటున్న వారి దగ్గరకి!...

—జీవించడానికి అర్హత కావాలనుకుంటున్న వారి దగ్గరకి...

—జీవితంలో జీవించాలనుకుంటున్న వారి దగ్గరికి?

అక్కడ్నించి మరో వైపుకి బయల్దేరింది నల్లటి ఆకారంలో ఉన్న... మృత్యుదేవత..

—బ్రతికుండి కూడా జీవచ్ఛవాలుగా మిగిలిపోయిన వారి దగ్గరకి!

—బ్రతుకుకి అర్థం తెలియకుండా బ్రతుకుతున్న వారి దగ్గరికి...!

బ్రతకడానికి అర్హత కోల్పోయిన వారి దగ్గరకి...! ✱

